క్లుప్తంగా

చిన్నారులకు అన్నప్రాసన



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): సామాజిక వేడుక కార్యక్రమంలో భాగంగా బుధవారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త జి. ధనలక్ష్మి, వైద్య సిబ్బంది మాట్లాడుతూ పిల్లలకు తల్లిపాలతో పాటు ద్రవ రూపంలో అదనపు ఆహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో గర్భవతులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు, ప్రీస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

పెనుగంచిప్రోలు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2025–26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనుల ప్రణాళికకు సంబంధించి గురువారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఏపీఓ తిరుపతయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం తోటచర్ల, 8వ తేదీన కొణకంచి, 11న ముండ్లపాడు, 12న ముచ్చింతాల, శివాపురం, 13న లింగగూడెం, 14న కొల్లికుళ్ల, సుబ్బాయిగూడెం, 15న వెంకటాపురం, వెంగనాయకునిపాలెం, 16న అనిగండ్లపాడు, గుమ్మడిదుర్రు, 18న నవాబుపేట, 20న పెనుగంచిప్రోలు గ్రామ సచివాలయాల వద్ద గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

గ్రామ పటాన్ని ఆవిష్కరించిన విద్యార్థులు



మక్కపేట(వత్సవాయి): బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఆఖరి సంవత్సరంలో భాగంగా గ్రామీణ పని అనుభవం కార్యక్రమం కింద గ్రామంలోని రైతులతో మమేకమై వ్యవసాయం గురించి తెలుసుకుంటున్నారు. దీనిలో భాగంగా బుధవారం గ్రామ సచివాలయం వద్ద గ్రామ చిత్రపటాన్ని ఆవిష్కరించారు. గ్రామంలో వ్యవసాయ, బీడు భూమి ఎంత ఉన్నది.. జనాభా, ముఖ్యమైన ప్రదేశాలు, ఇళ్ల వంటివి చిత్రపటంలో పొందుపరిచారు. గ్రామంలోని పరిస్థితులకు అనుగుణంగా ఏ విధంగా సాగుచేయాలి, పంట మార్పిడి, పశువుల వ్యర్థాలను వాడుకోవడం వంటి వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు కె. అచ్యుతరాజ్, ఐ. వెంకటరెడ్డి, ఎస్ఎంఎస్ రాజశేఖర్, సర్పంచ్ మల్లెల శివ, మాజీ ఏఎంసీ చైర్మన్ మల్లెల గాంధీ, ఎంపీఈవో దివ్య, రైతులు కొండబోలు బ్రహ్మం, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, గోళ్ల తిరుపతమ్మ, సత్తి వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడిపై కేసు నమోదు

జగ్గయ్యపేట: మండలంలోని షేర్‌మహ్మద్‌పేట గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు చిట్టిప్రోలు సుధాకర్‌పై చిల్లకల్లు పోలీసులు మంగళవారం అర్ధరాత్రి కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. గ్రామంలోని సైదారెడ్డి బజారులో రాత్రి 10గంటల సమయంలో సుధాకర్ మద్యం సేవించి ఆ ప్రాంతంలోని మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించడమే కాకుండా అసభ్యకరంగా మాట్లాడుతూ కించపరిచాడు. దీంతో ఆ ప్రాంతానికి చెందిన వ్యక్తి ఫిర్యాదు మేరకు ఎస్సై తోట సూర్య శ్రీనివాస్ కేసు నమోదు చేశారు. సుధాకర్ మాట్లాడిన సన్నివేశాలు సోషల్ మీడియాలో కూడా వైరల్ అయ్యాయి.

విధిగా పౌష్టికాహారం అందించాలి

నందిగామ టౌన్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు విధిగా పౌష్టికాహారం అందించాలని ఆర్డీవో బాలకృష్ణ సూచించారు. పట్టణంలోని రెండవ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని అంగన్‌వాడీ సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలోని రికార్డులను పరిశీలించి సిబ్బంది విధులను అడిగి తెలుసుకున్నారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

బంగారు చైను చోరీ


జి.కొండూరు: ద్విచక్ర వాహనంపై వెళుతున్న మహిళ మెడలో బంగారు చైన్‌ను చోరీ చేసిన ఘటన గడ్డమణుగు గ్రామ శివారులో బుధవారం ఉదయం జరిగింది. ఎస్ఐ సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ రూరల్ మండల పరిధి కొత్తూరుకు చెందిన వీరంకి వెంకాయమ్మ తన కుటుంబ సభ్యులు వీరంకి శ్రీనివాసరావు, రేవతితో కలిసి వీర్లపాడు మండల పరిధి అల్లూరు గ్రామంలో గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై బుధవారం ఉదయం బయలు దేరారు. జి.కొండూరు మండల పరిధి గడ్డమణుగు గ్రామ శివారులోకి రాగానే ఉదయం 7.45 గంటల సమయంలో వెనక నుంచి బైకుపై వచ్చిన వ్యక్తి వెంకాయమ్మ మెడలోని మూడు కాసుల బంగారు చైన్‌ను లాక్కొని పరారయ్యాడు. బాధితురాలు జి.కొండూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

అనుభవించలేక.. అమ్ముకోలేక..

- ఇనాం భూముల సమస్యతో నలిగిపోతున్న బాధితులు
- రిజిస్ట్రేషన్లు, క్రయవిక్రయాలు నిలిపివేత
- ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్న వైనం



జగ్గయ్యపేట పట్టణం వ్యూ



భూములకు సంబంధించిన సర్వే నెంబర్ల లిస్ట్

జగ్గయ్యపేట అర్బన్: అంగట్లో అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని అన్నట్లుగా భూములు కొనుక్కున్నప్పటికీ వాటిని అనుభవించలేక, ఎవరికీ అమ్ముకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పలువురు బాధితుల పరిస్థితి దారుణంగా ఉంది. ఎందరో చేతులు మారి కొనుగోలు చేసిన ఆ భూములు ఇనాం భూముల జాబితాలో ఉండటంతో వారికి కష్టాలు మొదలయ్యాయి. సమస్య పరిష్కారం అయ్యేదెలా అంటూ ఎదురుచూస్తున్నారు. ఇనాం భూముల సమస్య నేపథ్యం చూసినట్లైతే.. 200 సంవత్సరాల క్రితం ముక్త్యాల సంస్థానం పాలకులు రాజా వెంకటాద్రినాయుడు దేవాలయాల అభివృద్ధి కోసం పట్టణంలోని శ్రీచంద్రమౌళీశ్వరస్వామి ఆలయం (పెద్ద శివాలయం), శ్రీరంగనాయకస్వామి ఆలయాలకు జాయింట్‌గా 473.38 ఎకరాల భూమిని విరాళంగా ఇచ్చారు. ఆ తర్వాత ఆ భూములను నిరుపేదరికంలో ఉన్న అప్పటి దేవస్థాన సిబ్బంది వేరే వారికి అమ్ముకున్నారు. అక్కడి నుంచి ఒక్కొక్క భూమి 10 నుంచి 15 మంది చేతులు మారడంతో సమస్యగా మారింది. దీంతో ఆ భూముల్లో నిర్మాణాలకు టౌన్‌ప్లాన్ ఇవ్వడం కాని, క్రయవిక్రయాలు చేయడానికి కాని వీలు లేకుండాపోయింది. దీంతో ప్రజలు, ప్లాట్ల యజమానులు ఆందోళన చెందుతున్నారు.

నియోజకవర్గంలో రెండు వేల మంది బాధితులు

రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 30 వేల ఎకరాలకు సంబంధించి రెండు లక్షల మంది బాధితులు ఉండగా, జగ్గయ్యపేట నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు రెండు వేల మంది బాధితులు ఉన్నారు. పక్కనే ఉన్న నందిగామ, మైలవరం నియోజకవర్గాల పరిధిలో కూడా ఇనాం భూముల బాధితులు అనేక మంది ఉన్నారు. కాగా జగ్గయ్యపేటకు సంబంధించిన భూముల్లో ముప్పావు వంతు పట్టణం నిర్మాణాలను కలిగి ఉంది. ఆ స్థలంలో అనేక నివాస గృహాలు, స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. దీంతో ఈ భూములపై దేవస్థానం వారు ఏడేళ్ల క్రితం హైకోర్టును ఆశ్రయించగా కోర్టు సంబంధిత 42 సర్వే నెంబర్లలో ఉన్న భూమి రిజిస్ట్రేషన్లను నిలిపివేయాలని ఆదేశించింది. సర్వీసు ఇనాం భూములు కూడా ఇదే సర్వే నెంబర్లను కలిగి ఉండటంతో సర్వీసు చేయనివారి నుంచి స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చాయి. సర్వీసుదారులు ఇప్పటికే భూములను విక్రయించినట్లయితే అవి చెల్లుబాటు కావని హైకోర్టు తీర్పు ఇచ్చింది. వాటిని స్వాధీనం చేసుకోవడానికి సదరు దేవస్థానాలకు హక్కులు కల్పించింది. ఈ భూముల్లో తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, సబ్‌జైల్, ఆర్‌అండ్‌బీ బంగ్లా వంటి ప్రభుత్వ కార్యాలయాలు కూడా ఉండటం గమనార్హం. నిషేధిత జాబితాలో ఉన్న స్థలాల పరిధిలో మున్సిపాలిటీ వారు రోడ్లు, డ్రెయిన్లు, పైపులైన్లు తదితర ప్రజాహిత సౌకర్యాలను కల్పించడానికి కూడా ఎండోమెంట్ అధికారులు ఒప్పుకోవడం లేదు. దీంతో మున్సిపల్ అధికారులు ఎండోమెంట్ అధికారులను ప్రజాహిత కార్యక్రమాలు అయినందున ఒప్పించి చివరకు రోడ్లు, డ్రెయిన్లు, పైపులైన్లు వేశారు. ఈ సమస్యను ఎలాగైనా ప్రభుత్వం పరిష్కరించాలని బాధితులు కోరుతున్నారు.

ఇల్లు కట్టుకోవాలన్నా ఇబ్బందులే



నా ఐదు సెంట్ల భూమి ఇనాం భూముల సర్వే నెంబర్‌లో ఉంది. ఈసీలో ఎండోమెంట్ అని వస్తుంది. ఇల్లు నిర్మించుకోవాలన్నా, క్రయవిక్రయాలు చేయాలన్నా కుదరడం లేదు. బ్యాంకులో రుణాలు తీసుకుందామన్నా ఇవ్వడం లేదు. ఆడ పిల్లలకు శుభకార్యాలు చేయాలన్నా అమ్ముకోలేకపోతున్నాం. కట్న కానుకలకు భూములు ఇస్తున్నా తీసుకోవడం లేదు. భూములకు సంబంధించి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

మన్నె అప్పారావు, బాధితుడు, జగ్గయ్యపేట

భూములకు చట్టబద్ధత కల్పించాలి



ఇనాం భూముల సమస్య పరిష్కారం కోసం గత కొంత కాలంగా కృషి చేస్తూనే ఉన్నాం. అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలవగా సానుకూలంగా స్పందించారు. గతంలో ఈ భూములకు సంబంధించి హైకోర్టు ఎండోమెంట్ వారికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ భూములకు రాష్ట్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పిస్తే సుప్రీం కోర్టు ద్వారా సమస్య పరిష్కారానికి వెసులుబాటు కలుగుతుంది.

పింగళి నరసింహారెడ్డి, బాధితుడు, జగ్గయ్యపేట

పెండ్యాలలో పొలం పిలుస్తోంది



పెండ్యాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు

కంచికచర్ల: మండలంలోని పెండ్యాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించినట్లు మండల వ్యవసాయశాఖ అధికారి కె. విజయకుమార్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ ఏడీఏ మోనీషా పాల్గొన్నారు. ముందుగా రైతులతో కలిసి పంటలను పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయంలో వారు మాట్లాడుతూ.. శాస్త్రీయ పద్ధతిలో పంటలు సాగుచేసుకోవాలని తక్కువ పెట్టుబడి గల పంటలను ఎన్నుకోవాలని రైతులకు సూచించారు. సేంద్రీయ ఎరువులు వాడకం వల్ల అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. పంటలు సాగుచేసే ముందు భూసార పరీక్షలు చేయించుకోవాలని, పంటల సాగు సమయంలో వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మందులు పిచికారి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నందిగామ ఏడీఏ ఐకే శ్రీనివాస్, గ్రామీణ వ్యవసాయ సహాయకులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

రైతులకు కియోస్క్‌ల సేవలు కనుమరుగు

- ఆర్బీకేలను నీరుగార్చిన కూటమి ప్రభుత్వం
- పనిచేయని మల్టీ ఫంక్షనల్ కియోస్క్‌లు
- పట్టించుకోని వ్యవసాయశాఖ అధికారులు



పనిచేయని మల్టీ ఫంక్షనల్ కియోస్క్ మిషన్

కంచికచర్ల: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి ఆదుకున్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా రైతుల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. గత ప్రభుత్వంలో గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలను నెలకొల్పి అనేక సేవలు అందించారు. రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, నాణ్యమైన విత్తనాలు రవాణా సమస్య లేకుండా రైతులకు స్థానికంగా అందేలా చర్యలు తీసుకుంది. ప్రధానంగా రైతు భరోసా కేంద్రాల్లోని కియోస్క్‌ల సాయంతో సాంకేతికంగా రైతులను ముందుకు తీసుకెళ్లేలా చొరవ చూపింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్బీకేలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చినప్పటికీ సేవల కొనసాగింపులో వివక్ష చూపుతోంది. వైఎస్సార్ సీపీ ముద్ర లేకుండా చేయడానికి ఆ సేవలకు స్వస్తి పలికింది. ఫలితంగా ఆర్బీకేల లక్ష్యాన్ని నీరుగార్చింది. రైతు సేవా కేంద్రాల్లోని కియోస్క్‌ల సేవలు కొండెక్కాయి. నందిగామ నియోజకవర్గంలో ఇప్పుడు అవి ఎక్కడా పని చేయడంలేదు.

గతంలో సేవలు ఇలా..

ఆర్బీకేల్లోని డిజిటల్ ఆధారిత సేవల ద్వారా ఈ మల్టీ ఫంక్షనల్ కియోస్క్‌లు సాంకేతికంగా రైతుల అవసరాలకు అందుబాటులోకి తెచ్చారు. ఇందులో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, ధరలు, రైతులు పండించిన వ్యవసాయోత్పత్తులకు మార్కెట్ రేటు, సమీపంలోని మార్కెట్ల వివరాలు, అక్కడి ధరలు ఇందులో డిస్‌ప్లే అయ్యేవి. దీంతో రైతులకు ఖచ్చితమైన సమాచారం తెలిసేది. ముఖ్యంగా వాతావరణ సమాచారం, వాతావరణంలో మార్పులు, ఏ సీజన్‌లో ఏఏ పంటలు సాగుచేస్తే మంచి ఫలితాలు పొందవచ్చో సమాచారం లభించేది. నాడు రైతులకు ఎంతో ఉపయోగపడిన కియోస్క్‌ల సేవలు కూటమి ప్రభుత్వంలో రైతాంగం దరికి చేరకుండా పోయాయి.

నియోజకవర్గంలో 69 ఆర్బీకేలు..

నందిగామ నియోజకవర్గంలోని కంచికచర్ల, నందిగామ, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో మొత్తం 69 ఆర్బీకే కేంద్రాలు ఉన్నాయి. నియోజకవర్గంలో ఆర్బీకేల ద్వారా 50వేల మంది రైతులు అనేక సేవలు పొందుతున్నారు. ఆర్బీకేల్లో మొత్తం 69 మల్టీ ఫంక్షనల్ కియోస్క్‌లు ఉన్నాయి. గత ప్రభుత్వం ఒక్కో కియోస్క్‌ను రూ. 21.8 లక్షల చొప్పున కొనుగోలు చేసింది.

కూటమి రాకతో నిర్లక్ష్యం..

కూటమి ప్రభుత్వం ఆర్బీకేలను నిర్లక్ష్యం చేస్తోంది. ఇందులో రైతులకు అందించే సేవలన్నీ మాయమయ్యాయి. సాంకేతిక కారణాలతో ఆయా కేంద్రాల్లోని కియోస్క్ యంత్రాలు పనిచేయడం లేదు. లక్షల విలువైన యంత్రాలు ప్రస్తుత ప్రభుత్వంలో దిష్టి బొమ్మలుగా మారాయి. కొన్ని చోట్ల ఇవి బాగున్నా ఇంటర్నెట్ లేదంటూ ఆపేశారు. దీంతో కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగమైంది. కియోస్క్‌లున్నా రైతులకు మేలు చేయని పరిస్థితి కల్పించినట్లయింది. వీటిపై స్థానిక వ్యవసాయశాఖ అధికారులు సైతం పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా వీటి సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురావాలని పలువురు రైతులు కోరుతున్నారు.

కియోస్క్‌లతో అనేక ప్రయోజనాలు



రైతు సేవా కేంద్రాలు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉన్నలాగా ఇప్పుడు లేవు. సెంటర్లలోని కియోస్క్‌లో రైతులకు అవసరమైన ఎన్నో సేవలు ఉండేవి. ఇప్పుడు అటువంటి సేవలు లేవు. మిషన్‌లు కూడా పనిచేయడం లేదు. ఇప్పటికే ఉన్న మెషిన్‌ను రెడీ చేస్తే సరిపోతుంది. ఏదో ఓ సమయంలో రైతులు సెంటర్‌కు వెళ్లి దాంట్లో అనుమానాలను నివృత్తి చేసుకోవచ్చు.

కోదాటి రామకృష్ణ, రైతు, ఎస్.అమరవరం

ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం



కొన్ని రైతు సేవా కేంద్రాల్లో కియోస్క్‌లు సాంకేతిక కారణంగా పనిచేయడం లేదు. కొన్ని మాత్రం పనిచేస్తున్నాయి. ఆయా మండలాల్లో పనిచేయని వాటి గురించి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం. కానీ పైఅధికారుల నుంచి స్పందన రాలేదు. ఈ అంశంపై మరోసారి అధికారులతో మాట్లాడుతాం.

కే విజయకుమార్, మండల వ్యవసాయశాఖ అధికారి, కంచికచర్ల

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు జమ్మవరం విద్యార్థిని



జమ్మవరం(వీరులపాడు): రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు మండలంలోని జమ్మవరం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని ఎంపికైనట్లు వ్యాయామోపాధ్యాయుడు సాంబశివరావు తెలిపారు. స్థానిక పాఠశాల ఆవరణలో బుధవారం రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినీని సర్పంచ్ మల్లెల అనూష, ఎంపీటీసీ సభ్యురాలు యాదాల సుజాత, పాఠశాల కమిటీ చైర్మన్ రామారావులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ పటమట బాలుర పాఠశాలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-14 వాలీబాల్ పోటీల్లో తమ పాఠశాల ఎనిమిదవ తరగతి విద్యార్థిని అక్షా ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై ఉన్నారు. ఈనెల తొమ్మిది నుంచి విజయనగరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థిని పాల్గొంటుందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన



జగ్గయ్యపేట: ఆటోడ్రైవర్లు లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని సీఐ పి. వెంకటేశ్వర్లు హెచ్చరించారు. పట్టణంలోని పాత మున్సిపల్ సెంటర్‌లో బుధవారం ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కొందరు డ్రైవర్లు ప్రయాణికులను పరిమితికి మించి ఎక్కించుకుంటున్నారన్నారు. అంతేకాకుండా లౌడ్ స్పీకర్ల వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా పట్టణంలో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సైతం ద్విచక్ర వాహనాలు నడుపుతున్నారని తల్లిదండ్రులు గమనించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై బేబి రాణి, సిబ్బంది పేర్కొన్నారు.

విధుల్లో అలసత్వం వద్దు



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపిడీవో నితిన్

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): గ్రామ సచివాలయ సిబ్బంది విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో జి. నితిన్ హెచ్చరించారు. బుధవారం ఆయన గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో సిబ్బంది హాజరు, పనితీరును అడిగి తెలుసుకున్నారు. కొంతమంది సిబ్బంది విధుల్లో నిర్లక్షంగా వ్యవహరిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. అన్ని గ్రామాల్లో సచివాలయ సిబ్బంది ఉదయం, సాయంత్రం వేళల్లో బయోమెట్రిక్ వేయాలని సూచించారు. అదేవిధంగా గ్రామంలో తాగునీటి సరఫరా విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఎప్పటికప్పుడు డ్రెయినేజీలో పూడికతీత, పారిశుద్ధ్య పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఫణి, జూనియర్ అసిస్టెంట్ నాగులు తదితరులు ఉన్నారు.

సోషల్ మీడియా కార్యకర్తలపై కక్షసాధింపు చర్యలు

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం, పోలీస్ శాఖ అక్రమ కేసులు బనాయిస్తూ ఇబ్బంది పెట్టడం తగదని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ వ్యవస్థలను సక్రమంగా పని చేయనిస్తున్నామా లేదా అనే విషయాన్ని కూటమి నేతలు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై 42 కేసులు నమోదు చేస్తే ఒక్క నందిగామ నియోజకవర్గంలోనే తొమ్మిది మందిపై కేసులు పెట్టారని తెలిపారు. అభివృద్ధిలో రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలబెడుతామన్న కూటమి నేతలు అక్రమ కేసులు బనాయించడంలో ప్రథమ స్థానంలో నిలిపారని అన్నారు. పోలీసులు సోషల్ మీడియా కార్యకర్తల పట్ల వ్యవహరిస్తున్న తీరుపై న్యాయ పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు అధికం అయ్యాయని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్‌లపై గౌరవం పోయేలా వ్యవహరిస్తూ కేవలం రాజకీయ కక్ష సాధింపులకు ఆ చట్టాలను వినియోగించడం బాధాకరమని అన్నారు. వైఎస్సార్ సీపీకి 40 శాతం మంది ప్రజల మద్దతు ఉందని ఎవరు ఎన్ని విధాలుగా ఇబ్బంది పెట్టినా భయపడేది లేదని స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చింతా రవీంద్రనాథ్, నెలకుదిటి శివనాగేశ్వరరావు, కోటేరు ముత్తారెడ్డి, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, బండారు వెంకట్రావ్, న్యాయవాది పీఎల్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ



నందిగామలో గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

నందిగామ టౌన్: సీనియర్ న్యాయవాది నంద్రు శ్రీరామ్మూర్తిపై అక్రమ కేసు నమోదు చేయడం పోలీసుల నిరంకుశ వైఖరికి నిదర్శనమని బార్ అసోసియేషన్ కార్యదర్శి అద్దంకి మణిబాబు, మాజీ అధ్యక్షుడు కన్నెకంటి జీవరత్నం, బండి మల్లికార్జునరావులు పేర్కొన్నారు. అక్రమ కేసులను నిరసిస్తూ న్యాయవాదులు బుధవారం విధులు బహిష్కరించి స్థానిక గాంధీ సెంటరులో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భావ ప్రకటన స్వేచ్ఛ రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కన్నారు. అటువంటి హక్కును కాలరాసేలా పోలీసులు వ్యవహరించడంతో పాటు అక్రమ కేసులు బనాయించి న్యాయవాదులను అవమానపరిచేలా నడుచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు కురగంటి ఆదాము, పీఎల్ నరసింహారావు, దగ్గుపాటి కమలాకరరావు, గంథ్రాల రత్నకుమార్, కృష్ణప్రసాద్, నూతన్, లక్ష్మీకాంత్, వేల్పుల ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట అర్బన్: నందిగామ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది నంద్రు శ్రీరామమూర్తిపై నందిగామ పోలీసులు అక్రమ కేసు బనాయించడాన్ని ఖండిస్తూ జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు ఆధ్వర్యంలో బుధవారం న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయవాదులు పోలీసుల చర్యలను తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో న్యాయవాదులు పసుపులేటి సత్యశ్రీనివాసరావు, కరణం నరసింహారావు, బత్తుల వెంకట్రామయ్య, ఎం.కృష్ణయ్య, జి. శ్రీనివాసగౌడ్, ఎం.ఆంజనేయులు, కె.శ్రీనివాసరావు, రావూరి ప్రసాద్, పూల నాగరాజు, దాసరి నాగేశ్వరరావు, కరిసె రత్నబాబు, అశోక్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నందిగామ నియోజకవర్గంలో అరాచక పాలన

ఎమ్మెల్సీ డాక్టర్ అరుణ్‌కుమార్



సెంట్రల్ పార్టీ కార్యాలయంలో సజ్జల, అయోధ్యను కలిసిన నేతలు

కంచికచర్ల: నందిగామ నియోజకవర్గంలో అరాచకపాలన సాగుతోందని.. సామాన్య ప్రజలు సైతం భయభ్రాంతులకు గురవుతున్నారని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. సోషల్ మీడియా కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం, పోలీసులు వేధిస్తున్న తీరు గురించి వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, రాజ్యసభ సభ్యుడు అయోధ్య రామిరెడ్డి, రాష్ట్ర లీగల్‌సెల్ కన్వీనర్ పొన్నవోలు సుధాకరరెడ్డిలను ఎమ్మెల్సీ డాక్టర్ అరుణ్‌కుమార్, కంచికచర్ల ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, సోషల్ మీడియా కార్యకర్తలు బుధవారం సెంట్రల్ పార్టీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో వైఎస్సార్ సీపీ కార్యకర్తలను సోషల్ మీడియా కార్యకర్తలుగా ముద్రించి కూటమి ప్రభుత్వాన్ని ఎక్కడ ప్రశ్నిస్తారోనని భయపడి ముందుగా కేసులు పెట్టారని తెలిపారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని సజ్జల రామకృష్ణారెడ్డి, పొన్నవోలు సుధాకరరెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వేల్పుల రమేష్, మార్త శ్రీనివాసరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల శిక్షణ సమయం కుదించాలి

డీపీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీను



సభ్యత్వం అందజేస్తున్న శ్రీను తదితరులు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణ సమయాన్ని కుదించాలని డెమొక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను డిమాండ్ చేశారు. గుంటుపల్లి జెడ్పీ పాఠశాలలో డీపీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. పలువురికి సభ్యత్వాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల శిక్షణ సదస్సు ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు నిర్వహించడం వల్ల 50 ఏళ్లు పైబడిన వారు ఒత్తిడికి గురవుతున్నారన్నారు. శిక్షణ సమయంలో పీహెచ్‌సీ వైద్యుడితో కూడిన వైద్య బృందం అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. మండల శాఖ అధ్యక్షురాలు బి.ఆదిలక్ష్మి, జిల్లా కార్యదర్శులు కె. వెంకటేశ్వర్లు, వి. లాల్, రాష్ట్ర కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులు, చట్టాలపై అవగాహన

జి.కొండూరు: బాలల భద్రత అందరి బాధ్యత అని సీడీపీఓ పుష్పలత అన్నారు. బాలల హక్కులు, చట్టాలపై ఎంఎస్‌కేలు, వీఏఎలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బందికి జి.కొండూరు కమ్యూనిటీ హాల్‌లో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన తహసీల్దార్ సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ రామకృష్ణ నాయక్, ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రొటెక్షన్ స్కీమ్ ప్రతినిధులు వై. జాన్స్, ఎం. జీవన్‌కుమార్ మాట్లాడుతూ బాలల రక్షణకు చేపట్టవలసిన అంశాలను వివరించారు. ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: బాలల చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని చైల్డ్ ప్రొటెక్షన్ సంస్థ ప్రతినిధి వై. జాన్సన్ అన్నారు. ఇబ్రహీంపట్నం వెలుగు కార్యాలయంలో సీడీపీఓ కె. పుష్పలత అధ్యక్షతన బాలల చట్టాలు, కిశోరి వికాసం, బేటీ బచావో బేటీ పడావో చట్టాలపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. జాన్సన్, జీవన్ కుమార్ మాట్లాడుతూ బాలల పరిరక్షణ, వారి హక్కులను వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి. రమాదేవి, వాసవ్య మహిళా మండలి సభ్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.